కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

దానం నాగేందర్



ప్రచారం చేస్తున్న దానం నాగేందర్

అడ్డగుట్ట: సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఈ సారి కాంగ్రెస్ జెండా ఎగరవేయనున్నామని ఆ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. బుధవారం అడ్డగుట్ట చంద్రయ్య హోటల్ నుంచి తుకారాంగేట్ సుభాష్ బొమ్మ వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. అందువల్లే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అవకాశం కల్పించారన్నారు. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన విధంగానే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పుంజుకుంటుందని, కేంద్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పాటైన రాష్ట్రాల్లో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు దూసుకుపోతున్నామన్నారు. ప్రచారంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతారెడ్డి, ఆదం సంతోష్, ఆదం ఉమాదేవి, శిల్పాచారి, గంట రాజు సాగర్, సందీప్‌రాజ్, కిషోర్ యాదవ్, రామలీల పాల్గొన్నారు.

‘సాక్ష్యం యాప్’ను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న యూసీడీ డీపీఓ శ్రీనాథ్

అడ్డగుట్ట: ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జీహెచ్‌ఎంసీ యూసీడీ డీపీఓ శ్రీనాథ్ సూచించారు. బుధవారం అడ్డగుట్టలోని పలు బస్తీలలో ఇంటింటికీ తిరుగుతూ ఓటు హక్కు వినియోగంతో పాటు అంగవైకల్యం కలిగిన వారి కోసం ఎలక్షన్ కమిషన్ ప్రవేశ పెట్టిన సాక్ష్యం యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ.. ఓటు హక్కు అనేది ప్రతీ పౌరుడు బాధ్యతగా భావించి తమ హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు వేయడానికి పోలింగ్ స్టేషన్‌కు రాలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు ఈ యాప్‌లో వారి వివరాలు నమోదు చేసుకొని వారికి కావాల్సిన రిక్వెస్ట్ పెట్టాలని సూచించారు. తద్వారా సదరు ఓటర్‌ను వారి ఇంటి వద్దకు వెళ్లి పోలింగ్ స్టేషన్‌కు తీసుకొచ్చి ఓటు వేసిన అనంతరం తిరిగి ఇంటి వద్ద విడిచిపెట్టే బాధ్యత తమ సిబ్బంది తీసుకుంటారని వివరించారు. అదే విధంగా నడవలేని స్థితిలో ఉన్న సీనియర్ సిటిజెన్స్ కూడా ఈ అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ యాప్‌లో ఓటర్ రిజిస్ట్రేషన్, ఫెసిలిటీ ఎట్ పోలింగ్ బూత్, సెర్చ్, ఇన్‌ఫర్మేషన్ అండ్ కంప్లైయింట్స్‌కు సంబంధించి వివరాలు కూడా అందుబాటులో ఉంటాయని సూచించారు.

కంటోన్మెంట్‌లో ఆయారాం.. గయారాం



శ్రీగణేశ్ సమక్షంలో చేరిన బీఆర్‌ఎస్ నేతలు



బీఆర్‌ఎస్‌లోకి చేరిన రెండో వార్డు నేతలు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో పార్టీ మార్పులు జోరందుకుంటున్నాయి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య ఆయారాం గయారాంల సంస్కృతి జోరు మీదుంది. తాజాగా మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సాంబ అశోక్ నేతృత్వంలో పలువురు కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యమంత్రి రక్షణ స్థలాల్లోని బస్తీ వాసులకు పట్టాలు ఇస్తామన్న హామీతోనే తాము కాంగ్రెస్‌లో చేరినట్లు అశోక్ ప్రకటించారు. రక్షణ శాఖ స్థలంలో 30 ఏళ్ల క్రితం వెలిసిన ఈ బస్తీవాసులకు భూబదలాయింపు ద్వారా పట్టాలు ఇప్పిస్తానని శ్రీగణేశ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కొమురయ్య, మల్లికార్జున్, మహేశ్, నాగన్న కాంగ్రెస్‌లో చేరారు.

వారంలోనే సొంత గూటికి..

కంటోన్మెంట్ రెండో వార్డుకు చెందిన అంజద్, నిహాల్ నేతృత్వంలో పలువురు కార్యకర్తలు వారం రోజుల క్రితం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా టీఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తిరిగి బీఆర్‌ఎస్‌లో వచ్చారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ శ్రీధర్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అఫ్రోజ్, ఇమ్రాన్, రిజ్వాన్, మజర్, పాషా, సోహైల్, అశ్వాక్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే పట్టాలు, విలీనం

రోడ్‌షోలో మైనంపల్లి



బోయిన్‌పల్లిలో కాంగ్రెస్ అభ్యర్థుల రోడ్ షో

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడంతో ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు పట్టాలు దక్కుతాయని కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేశ్‌తో కలిసి బోయిన్‌పల్లిలోని పెన్షన్ లైన్, అంబేడ్కర్ చౌరస్తా, ఏడుగుళ్లు, పెద్ద తోకట్టా ప్రాంతాల్లో భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి ఎంపీగా పనిచేసిన సీఎం రేవంత్ రెడ్డికి ఇక్కడి



సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. ఇటీవల కంటోన్మెంట్ ప్రచారంలోనూ ఆయన పలు హామీలు ఇవ్వడాన్ని గుర్తు చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెన్నెల గద్దర్, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ కొత్త సంజీవ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డీబీ దేవుడు, నక్క ప్రభాకర్ గౌడ్, జంపన ప్రతాప్, అయూబ్ ఖాన్, ముప్పిడి గోపాల్, ముప్పిడి మధుకర్ పాల్గొన్నారు.

కలుషితం.. స్పందించరేం ?





డీ సెక్షన్‌లో సరఫరా అయిన కలుషిత నీరు

అడ్డగుట్ట : కలుషిత నీటి సరఫరాతో నానా అవస్థలు పడుతున్నామని డీ–సెక్షన్ వాసులు వాపోతున్నారు. అడ్డగుట్ట డివిజన్‌లోని డీ–సెక్షన్ ప్రాంతంలో నాలుగు రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోంది. పూర్తిగా మురుగునీటి వాసనతో తాగునీరు వస్తున్నాయని వాపోతున్నారు. అసలే లో ప్రెషర్ సమస్యతో బాధ పడుతుంటే దీనికి తోడు కలుషిత నీటి సరఫరాతో గుక్కెడు నీళ్లు కూడా తాగలేని పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీళ్లు సరఫరా అయ్యే గంట సమయంలో అరగంట పాటు కలుషిత నీళ్లే వస్తున్నాయని మారేడుపల్లి సెక్షన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా సమస్యను పరిష్కరించలేదని బస్తీవాసులు చెప్పుకొస్తున్నారు.

ఆటోతో వచ్చాను.. ఓటుతో ఆశీర్వదించండి

ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ బుధవారం అడ్డగుట్టలో పాదయాత్ర చేశారు. అనంతరం ఆటో నడుపుతూ ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకర్షించారు.

–అడ్డగుట్ట





లోక్‌సభ, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి కంటోన్మెంట్‌లోని వివిధ వార్డుల్లో పర్యటించారు. అనంతరం కాకాగూడలోని పీసీసీ సెక్రటరీ ఎండీ అయూబ్‌ఖాన్ కార్యాలయంలో నాయకులు సంజీవ రెడ్డి, రఘునాథ్ యాదవ్, తదితరులతో కలిసి ఎన్నికలపై సమీక్షించారు.

–సాక్షి, సిటీబ్యూరో

బీఆర్‌ఎస్ గెలుపుతో చరిత్రను తిరగరాస్తాం

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



ప్రచారంలో పాల్గొన్న తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు

బన్సీలాల్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేసి చరిత్రను తిరగరాస్తామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మోండా మార్కెట్ డివిజన్‌లో బుధవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా నాయకుడు పద్మారావును ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. ఆకుల రూప, నాగులు, హరిక్రిష్ణ, తలసాని ధరమ్ యాదవ్, ధరం రాజ్ చౌదరి, బి. కిరణ్‌కుమార్ గౌడ్, తలసాని స్కైలాబ్, రామేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

అమీర్‌పేటలో..

అమీర్‌పేట: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు అమీర్‌పేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు ఎస్‌ఆర్‌నగర్, సైంటిఫిక్ కాలనీ, వేంకటేశ్వర దేవాలయం పరిసర ప్రాంతాల్లో ఇంటింటికి తిరుగుతూ బీఆర్‌ఎస్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. అశోక్‌యాదవ్, హనుమంత్‌రావు, కట్ట బల్‌రాం, కూతురు నర్సింహ, పీయూష్‌గుప్తా పాల్గొన్నారు.

బేగంపేటలో..

సనత్‌నగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్ల ప్రచారం కొనసాగిస్తున్నారు. బుధవారం బేగంపేట కార్పొరేటర్ పార్టీ శ్రేణులతో కలిసి పద్మారావును గెలిపించాలని కరపత్రాలు అందజేశారు.

రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో..

రాంగోపాల్‌పేట్: పద్మారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లావణ్య, ఆంజనేయులు, జనార్ధర్, సతీష్, గణేష్, కోటేశ్వర్, సత్యనారాయణ, కిషోర్, తదిరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి డివిజన్‌లో..

చిలకలగూడ: కారు గుర్తుకు ఓటేసి సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కోరారు. డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్, మోహన్‌రెడ్డి నగర్, నవరాలబస్తీ, మార్కండేయనగర్, ఐమాత టెంపుల్, ప్రైడే మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఏసీఎస్ నగర్‌లో..

అడ్డగుట్ట: డివిజన్‌లోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో బుధవారం సాయంత్రం కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. లింగాని శ్రీను, మనోహర్, వసంత, శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్య, నక్క మధు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

క్రిప్టో కరెన్సీ బాధితులు

అమీర్‌పేట: క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పేరిట మోసానికి గురైన తమకు న్యాయం చేయాలని బాధితులు ఎస్‌ఆర్‌నగర్ పోలీసులను కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు మాట్లాడారు. అంగూరి ప్రకాష్‌కుమార్ అనే వ్యక్తి మాయమాటలు నమ్మి దశల వారీగా డబ్బులు చెల్లించామన్నారు. తామంతా వ్యక్తిగతంగా అతడికి డబ్బులు చెల్లించామని ఇందులో సికింద్రాబాద్‌లోని ఇవాంజికల్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా (యూఈఎస్) సంస్థతో ఎలాంటి సంబంధం లేదని బాధితులు బి.విశాల్‌రాజ్ జకారియాస్, ఎం.శ్రీకాత్, పరుచూరి రామయ్య పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం



సమీర్

బౌద్ధనగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకార్ వివరాల మేరకు.. వారాసిగూడలోని షాబాజ్‌గూడ ప్రాంతానికి చెందిన మహ్మద్ సమీర్(23) చిలకలగూడలోని డెనిమ్ బట్టల షోరూమ్‌లో పని చేస్తుంటాడు. ఏప్రిల్ 30న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమీర్ అర్ధరాత్రైనా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే సంక్షేమ పథకాల అమలు



ప్రచారం నిర్వహిస్తున్న రాకేష్ మాదిగ, వెంకట్‌రాముడు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత సాయన్నకు మద్దతుగా మూడవ వార్డు పరిధిలోని అంబేడ్కర్ సొసైటీ, మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్‌నగర్, గాంధీనగర్, శ్రీరాంనగర్ బస్తీల్లో పార్టీ నాయకులు బుధవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారుగుర్తుపై ఓటేసి నివేదితను గెలిపించాలని కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. గత పదేళ్లల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో పేదలకు అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా పేదలకు సకాలంలో పింఛన్లు అందడం లేదన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని వివరించారు. ఈ ప్రచారం కార్యక్రమంలో పెరుమాళ్ టెంపుల్ ట్రస్ట్ మాజీ సభ్యులు సురేష్, నేతలు వెంకట్ రాముడు అనిల్, సుదర్శన్, శేఖర్, రాకేష్ మాదిగ, కనకయ్య, ధనుంజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సత్తాచాటిన భోలక్‌పూర్ విద్యార్థులు



సంబరాల్లో విద్యార్థులు, యాజమాన్యం

పద్మారావునగర్: ఎస్‌ఎస్‌సీ పరీక్షా ఫలితాల్లో బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ ప్రాంతానికి చెందిన క్రిష్ణవేణి టాలెంట్ విద్యార్థులు తమ సత్తా చాటారు. ఈ పాఠశాలలో 97శాతం విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. గోవింద్ కుమార్ 9.5 గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించారు. ఎస్‌ఎస్‌సీ ఫలితాల నేపథ్యంలో పాఠశాల ఆవరణలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు గోవింద్‌కుమార్‌ను అభినందించారు.

మళ్లీ కిషన్‌రెడ్డిదే విజయం



ప్రచారం చేస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

పద్మారావునగర్: సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం లో మళ్లీ కిషన్‌రెడ్డిదే విజయమని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. స్థానిక కార్పొరేటర్ కొంతం దీపికతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మోండా మార్కెట్‌లోని పలు బస్తీల్లో పర్యటించి రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల వల్ల ప్రజలకు ఎలాంటి మేలు జరగదన్నారు. పార్లమెంట్‌లో ప్రజల తరఫున గొంతు విన్పిపించడానికి తెలంగాణ అభివృద్ధి కోసం కిషన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. బీజేపీ నాయకులు దయానంద్ రావు, నర్సింగ్‌రావు, అశోక్ చారి, రమేష్, నర్సింగ్ యాదవ్, అశోక్‌కుమార్, సర్వేష్ పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి డివిజన్‌లో..

చిలకలగూడ: సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ మైలార్‌గడ్డ, భవానీనగర్, కిందిబస్తీ, నామాలగుండు తదితర ప్రాంతాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సికింద్రాబాద్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే కిషన్‌రెడ్డి గెలుపు ఖాయమైందని, దేశ ప్రధానిగా నరేంద్రమోదీ హ్యాట్రిక్ నమోదు చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం

సనత్‌నగర్: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఎస్‌ఆర్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 5 వరకు మూడు రోజుల పాటు చిన్నారులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కల్పన, విద్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఆర్‌నగర్‌లోని జీహెచ్‌ఎంసీ పార్కు ఎదురుగా గల రాజయోగా మెడిటేషన్ సెంటర్‌లో జరిగే ఈ శిబిరంలో యోగాసనాల ప్రాముఖ్యం, మానసిక ప్రశాంతత, ధ్యానం, స్ఫూర్తిని కలిగించే కథలు, మంచి ఆహారం అలవాట్లతో పాటు పలు అంశాల్లో ఆటల పోటీలు ఉంటాయని వివరించారు. 7 నుంచి 14 సంవత్సరాల బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సాహించాలన్నారు. ఉదయం 8.30 నుంచి 11.30 వరకు శిబిరం తరగతులు ఉంటాయని, ఆసక్తి ఉన్న చిన్నారులు 94917 46031 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కంటోన్మెంట్ పార్క్‌లో శ్రీగణేష్ ప్రచారం



వాకర్స్‌ని ఓటేయాలని కోరుతున్న శ్రీగణేష్

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ గణేష్ బుధవారం బొల్లారం కంటోన్మెంట్ పార్క్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా వాకర్స్‌ని కలిసి రాబోయే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్, స్థానిక నేతలు ఖదీరవన్ పాల్గొన్నారు.

సీఎం.. గుర్తు పెట్టుకో నీ కన్నా ముందే పద్మారావు రాజకీయాల్లో ఉన్నారు

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై తలసాని స్పందన

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగిన పద్మారావును బలిపశువుగా మార్చారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై తలసాని ఘాటుగా స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుపెట్టుకో నీకన్నా ముందే పద్మారావు రాజకీయాల్లో ఉండి 1986లో నే కార్పొరేటర్‌గా ఆ తర్వాత ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. జూన్ 4న వచ్చే ఫలితాలు చూస్తే మీకే తెలుస్తోందన్నారు. పద్మారావు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ఓ బ్రాండ్‌గా నిలిచారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్న మీరు.. మా ప్రభుత్వం కట్టిన సచివాలయం, ప్రగతి భవన్‌లో ఎలా కూర్చుంటున్నారని ప్రశ్నించారు. మీకు పోటీ చేయడానికి అభ్యర్థులు లేక మా పార్టీ నాయకులను చేర్చుకొని పోటీలో నిలపడాన్ని బట్టీ మీ పార్టీ పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చని ఈ ఎన్నికల్లో మాకు పోటీ బీజేపీతోనే ఉంటుందన్నారు.

రక్షణ శాఖ మంజూరు చేసిన 24,640 పోస్టులు భర్తీ చేస్తాం



మాట్లాడుతున్న గుర్బీర్‌పాల్ సింగ్

రసూల్‌పురా: రక్షణ మంత్రిత్వ శాఖ మంజూరు చేసిన 24,640 పోస్టుల ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ఎన్‌సీసీ డైరక్టర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్ పాల్ సింగ్ తెలిపారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం కంటోన్మెంట్ టీవోలీ రోడ్‌లోని తెలంగాణ, ఆంధ్ర ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయాన్ని సందర్శించారు. ఎన్‌సీసీ డిప్యూటీ డైరక్టర్ జనరల్ పీఎం. రెడ్డి ఎన్‌సీసీ అధికారులతో కలిసి డైరెక్టరేట్ పరిపాలన శిక్షణ కార్యకలాపాలను సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్‌సీసీ కెడేట్లు దేశ ప్రగతికి పాటు పడాలని ఇతరులకు సహాయ పడే అలవాటును అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన ఎన్‌సీసీ కెడేట్లను ప్రశంసా పత్రాలు, పతకాలతో సత్కరించారు.

మద్యం మత్తులో హల్‌చల్

ముగ్గురికి జైలు



కరుణాకర్, శివ, గణేష్

చిలకలగూడ : మద్యంమత్తులో హల్‌చల్ చేస్తూ ప్రజా జీవనానికి ఆటంకం కలిగించిన ముగ్గురికి జైలుశిక్ష విధించారు. చిలకలగూడ సీఐ అనుదీప్, ఎస్ఐ బాలరాజు వివరాల ప్రకారం.. చిలకలగూడకు చెందిన కరుణాకర్ (35), పార్శిగుట్టకు చెందిన శివ (26), గణేష్ (26) మద్యం మత్తులో ఆయా బస్తీల్లో ప్రతిరోజు హంగామా సృష్టిస్తూ స్థానికులపై దాడులకు పాల్పడుతుంటారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ–పెట్టీ కేసు నమోదు చేసి బుధవారం సికింద్రాబాద్ 15వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా ముగ్గురికి రెండు రోజుల చొప్పున జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి రవిశంకర్ తీర్పు ఇచ్చారు.

ఈ–పెట్టీ కేసులో యువకుడికి జైలు



జాకీర్

బౌద్ధనగర్: ఈ–పెట్టీ కేసుల్లో ఓ యువకుడికి వారం రోజుల జైలు శిక్ష విధించిన ఘటన వారాసిగూడ పోలీస్టేషన్‌లో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. మహ్మద్ జాకీర్ అలియాస్ నజీరుద్దీన్(22) ముషీరాబాద్‌లోని పఠాన్ బస్తీలో నివాసముంటున్నాడు. రెండ్రోజుల క్రితం మద్యంతాగి బస్తీలో గొడవ చేయడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ–పెట్టీ కేసు నమోదు చేశారు. బుధవారం సికింద్రాబాద్ సివిల్ కోర్టులో 15వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ రవి శంకర్ ముందు హాజరుపరచగా వారం రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రాంగోపాల్‌పేట్: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉండే సుభాష్ చంద్రబోస్ విగ్రహం ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు 108 సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.మృతుడికి సు మారు 50–55 ఏళ్ల వయసు ఉటుందని ఒంటిపై కేవలం ఫుల్ హ్యాండ్స్ బనియన్ మాత్రమే ధరించి ఉన్నా డని, సంబంధీకులు ఉంటే గోపాలపురం పోలీస్ స్టేషన్ లేదా 8712661249, 8712660248 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎగిరింది ఎర్రజెండా!



ఆటో డ్రైవర్లను సత్కరిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ ప్రాంతాల్లో ఎర్ర జెండాలు ఎగరవేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..హక్కుల పరిరక్షణ కోసం కార్మికులంతా ఏకమవ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

–అమీర్‌పేట/లాలాపేట/రాంగోపాల్‌పేట్/అడ్డగుట్ట



లాలాపేటలో మేడే వేడుకల్లో పాల్గొన్న కార్మికులు



మేడే వేడుకల్లో పాల్గొన్న యూనియన్ నాయకులు



రాయల సేవా సమితి ఆధ్వర్యంలో కార్మికులకు మిఠాయిలు పంచి పెడుతున్న దృశ్యం